సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

మూడు కుటుంబాలకు నిత్యావసర సరకులు



నిత్యావసర సరకులు అందిస్తున్న సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు

అగనంపూడి: ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్న మూడు నిరుపేద కుటుంబాలకు అగనంపూడికి చెందిన సర్వహిత చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు నెలకు సరిపడా బియ్యం, ఇతర నిత్యావసర సరకులు అందించారు. దిబ్బపాలెం, కొండయ్యవలస, పెదమడకకు చెందిన మూడు కుటుంబాలకు ఉక్కు ఉద్యోగి విందుల వెంకట కరుణాకరరావు ఆర్థిక సాయంతో వీటిని అందించారు. కార్యక్రమంలో దాత కరుణాకరరావు, ట్రస్ట్ వ్యవస్థాపకులు గుడే సుశీలా గజేంద్రరావు, సలహాదారులు పట్టా రామఅప్పారావు, చైర్మన్ మారా మస్తాన్‌రెడ్డి, ప్రతినిధులు లక్కరాజు రాము, బొండా ఈశ్వరరావు పాల్గొన్నారు.

కోడి పందాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న కోళ్లతో గాజువాక పోలీసులు

అక్కిరెడ్డిపాలెం: కోడి పందాల స్థావరంపై శనివారం గాజువాక పోలీసులు దాడులు చేసి ఇద్దరిపై కేసు నమోదు చేశారు. గాజువాక సీఐ పార్థసారథి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గాజువాక ఎల్‌బీ నగర్‌లో కోడి పందాలు నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించారు. దాడుల్లో 12 కోళ్లను స్వాధీనం చేసుకొని నిర్వాహకులు పెద్ది రాజు, మహేష్ పై కేసు నమోదు చేశామన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న ఓబీసీ, ఎస్సీ,ఎస్టీ, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులకు యాజమాన్యం వెంటనే పెండింగ్ జీతం చెల్లించాలని స్టీల్‌ప్లాంట్ ఓబీసీ ఉద్యోగుల సంఘం, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘం, విభిన్న ప్రతిభావంతుల ఉద్యోగుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు శనివారం స్టీల్‌ప్లాంట్ సీఎండీ కార్యాలయంలో లేఖ అందజేశారు. ఉద్యోగులు కనీసం రుణాలు కూడా చెల్లించలేని పరిస్థితిలో ఉందన్నారు. వెంటనే జీతాల చెల్లింపునకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఓబీసీ సంఘం నాయకులు బి. అప్పారావు, కొయిలాడ శ్రీనివాసరావు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ నాయకులు బయ్యే మల్లయ్య, బి. తొడన్న, ఎస్. సత్యనారాయణ, విభిన్న ప్రతిభావంతుల సంఘం నాయకులు పెంటారావు, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతీ సంప్రదాయాలను మరవొద్దు



తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న శంకర్ సాయిరాం

పెదగంట్యాడ: మన సంస్కృతీ సంప్రదాలను మరవొద్దని సత్యసాయి బాబా ఆధ్యాత్మిక ట్రస్ట్ నిర్వాహకుడు గల్లా శంకర్ సాయిరాం అన్నారు. జీవీఎంసీ 74వ వార్డు దయాల్‌నగర్ కొండపై వెలసిన కనకదుర్గమ్మ ఆలయంలో ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శనివారం విష్ణు, లలితా పారాయణాలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన తెలుగు సంవత్సరాది క్యాలెండర్‌ను ఆవిష్కరించారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు

గాజువాక

✆ 7997958388, 9912440606



స్ఫూర్తి.. దీప్తి

వివేకానందుని బాటలో పయనం • కొంత మంది సేవారంగంలో.. • మరికొంత మంది ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు

వివేకానంద.. ఆ పేరే ఒక ప్రేరణ. లక్ష్య సాధనకు ఆయుధం.. యువత తలచుకుంటే సాధించలేనిది ఏమీ ఉండదన్న ఆయన సూక్తినే ఆదర్శంగా తీసుకుని విభిన్న రంగాల్లో దూసుకుపోతుంది యువతరం. ఆయన స్ఫూర్తితో కొంతమంది సేవ చేస్తుంటే... మరికొంత మంది ఉన్నత లక్ష్యాల వైపు అడుగులు వేస్తున్నారు. సేవా కార్యక్రమాలతో ఆపన్న హస్తం అందిస్తున్నారు. మరి కొంత మందికి వెలుగునిస్తున్నారు. నేడు వివేకానందుని జయంతి.. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– గాజువాక

వివేకానంద బోధనలే ప్రేరణ



వివేకానంద బోధనలు నన్ను చాలా ప్రభావితం చేశాయి. విద్యార్థి దశలో ఆయన బోధనలను చదివి అర్థం చేసుకోవడం ప్రారంభించాను. చదువు పూర్తయిన తర్వాత ఉద్యోగం చేయాలన్న కోరిక కంటే విద్యారంగంలోనే సేవ చేయాలనే కోరిక బలంగా కలిగింది. దీంతో సొంతంగా ఒక స్కూల్ ప్రారంభించాను. మంచి విద్యార్థులను తయారు చేయాలనే లక్ష్యంతో పని చేస్తున్నాను. వివేకానందుని చరిత్ర చదవడం ద్వారా మంచి జీవిత విలువలను పెంపొందించుకున్నాను. సమాజ గమనంలో మన వంతు బాధ్యతను శ్రద్ధగా నిర్వహించాలన్న ప్రేరణను పొందాను. ఎన్ని ఇబ్బందులు వచ్చినా కుంగిపోకుండా ఆయన బోధనలతో ప్రేరణ పొందుతుంటాను.

– బి.శ్రీనివాసరావు, కరస్పాండెంట్, గిరీష్ విద్యానికేతన్

> ఇతరుల నుంచి మంచి ప్రతిదాన్ని నేర్చుకోండి.. దానిని తీసుకు వచ్చి మీ సొంత మార్గంలో ఆచరించండి.. ఇతరులుగా మారకండి.' 'ఓదార్పు అనేది సత్యానికి పరీక్ష కాదు. సత్యం తరచుగా సుఖంగా ఉండటానికి దూరంగా ఉంటుంది.' 'ఒకేసారి ఒక పని చేయండి.. అది చేస్తున్నప్పుడు మీ మొత్తం ఆత్మను దానిపై పెట్టండి.
>
> –స్వామి వివేకానంద

అంతర్జాతీయ గుర్తింపే లక్ష్యంగా క్రీడల్లోకి..



అంతర్జాతీయంగా గుర్తింపు పొందాలని 1989లో కరాటే సాధన ప్రారంభించాను. దేశానికి మంచి పతకాలు సాధించాలనే కోరికతో నేర్చుకున్నాను. కరాటే క్రీడాకారుడిగా 12 సార్లు జాతీయ స్థాయిలో చాంపియన్‌గా నిలిచాను. కిక్ బాక్సింగ్‌లో మూడుసార్లు నేషనల్ చాంపియన్‌షిప్ సాధించాను. వివిధ పాఠశాలలు, ప్రాంతాల్లో లక్ష మంది విద్యార్థులకు కరాటేలో శిక్షణ ఇచ్చాను. ప్రస్తుతం కరాటేలో నేషనల్ రిఫరీగా, జాతీయ స్థాయి న్యాయ నిర్ణేతగా ఉన్నాను. ఏసీయస్ కరాటే ఫెడరేషన్ ద్వారా రిఫరీగా, జడ్జిగా గుర్తింపు పొందాను. రిఫరీగా, జడ్జిగా 280 టోర్నమెంట్‌లకు పని చేశాను. అంతర్జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకోవాలన్నదే నా లక్ష్యంగా ముందుకు సాగుతున్నాను. నా ప్రయాణంలో నిరాశ అనేది నా దరికి రాకుండా ఉండడం కోసం స్వామి వివేకానంద సూక్తులు వింటుంటాను.

– కోరాడ సుమన్, కరాటే రిఫరీ, జడ్జి

వివేకానందుడితో దేశ ఔన్నత్యం వెలుగులోకి



భారతదేశ యువతను జాగృతం చేయడంలో స్వామి వివేకానంద కృషి ఎప్పటికీ ఆదర్శనీయం. దేశ ఔన్నత్యాన్ని ప్రపంచమంతటికీ చాటి చెప్పిన మహా తత్వవేత్త. ఆయన బోధనలు చదివినా, విన్నా మనం ప్రేరణ పొంది లక్ష్య సాధనకు ఉపక్రమిస్తామని చెప్పడంలో ఎటువంటి అతిశయోక్తి లేదు. టెక్నాలజీ పరంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత కాలంలో స్వామి వివేకానంద జీవితం నిత్య స్ఫూర్తి. నిరాశ, నిస్పృహల్లో ఉన్నప్పుడు ఆయన సూక్తులు గుర్తు చేసుకుంటే ఎంతో బలం చేకూరుతుంది. నేటి యువత ఆయన సందేశాన్ని స్వీకరించి కార్యసాధనలో ముందడుగు వేయాలి.

–బి.ఆర్.ఎస్.శేషాద్రి, జీవీఎంసీ జోనల్ కమిషనర్, గాజువాక

యువతపై సమాజ బాధ్యత



యువత సమాజాన్ని సమర్థవంతంగా నడిపించడల సమర్థులు. ఎలాంటి లక్ష్యాన్నైనా సాధించగల సత్తా ఉన్నవారు. పట్టుదల, తెగింపుతో సమాజాన్ని మంచివైపు నడిపించాలి. దురలవాట్లకు లోనై భవిష్యత్తును పాడు చేసుకోకూడదు. పెద్దలను గౌరవించేవారిగా ఉండాలి. ఉరకలెత్తే ఉత్సాహంతో ఉన్నతంగా స్థిరపడి దేశ ప్రగతిలో భాగస్వాములు కావాలి. యువతను మేల్కొలపడంలో తన సందేశాలతో అత్యంత ప్రభావం చూపిన మార్గనిర్దేశకుడు స్వామి వివేకానంద. ఆయన సందేశాలను ఆచరణలో పెట్టడమే ఆయనకు మనం ఇచ్చే గౌరవం.

– టి.శ్రీవల్లి, తహసీల్దార్, గాజువాక

వివేకానంద బోధనలు చిరస్మరణీయం



నేను విజయనగరం జిల్లాలోని ఒక పల్లెటూరులో పుట్టి పెరిగాను. చదువుకొంటున్న సమయంలోనే వివేకానంద బోధనలను చదువుతూ వచ్చాను. దీంతో ఏదో ఒక పని చేసి అందరిలో గుర్తింపు పొందాలనే కోరిక గట్టిగా కలిగింది. బతుకుతెరువు కోసం గాజువాక వచ్చి స్నాక్స్ వ్యాపారం ప్రారంభించాను. కొంతమంది నన్ను ఎగతాళి చేసేవారు. అయినా నేను పొందిన ప్రేరణముందు అవి నన్ను నిరాశ పరచలేకయాయి. నేను డిగ్నిటీ ఆఫ్ లేబర్‌ను ఇష్టపడతాను. అందువల్ల నేను ఎంచుకున్న మార్గాన్ని వదలకుండా పని చేశాను. ప్రస్తుతం నావద్ద 15 మంది యువకులు పని చేస్తున్నారు. నా ప్రోత్సాహం, ప్రోద్బలంతో విజయనగరంలో 30 కుటుంబాలతో హాట్‌చాట్ బళ్లు పెటించాను. కొంతమంది పేద విద్యార్థులకు పుస్తకాలు కూడా ఇస్తుంటాను. ఇది నాకు ఎంతో సంతృప్తి ఇస్తోంది.

– తెంటు శివ, శివ హాట్‌చాట్

జీతాలు చెల్లించాలని ఉద్యోగుల ధర్నా



ధర్నాలో ప్రసంగిస్తున్న అయోధ్యరామ్

ఉక్కునగరం: జీతాలు చెల్లించాలంటూ ఉక్కు కార్మికులు కంచాలతో ధర్నా చేపట్టారు. స్టీల్ సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం ఉక్కు పరిపాలన భవనం కూడలి వద్ద నిరసన ప్రదర్శన నిర్వహించారు. కార్మికులు కంచాలు కొడుతూ తమకు వెంటనే జీతాలు చెల్లించాలని, కుటుంబాలను ఆదుకోవాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవాధ్యక్షుడు జె. అయోధ్యరామ్ మాట్లాడుతూ యాజమాన్యం కార్మికులను ఇబ్బందులకు గురిచేయడం దుర్మార్గమన్నారు. పీఎఫ్ ట్రస్ట్‌కు రూ. 500 కోట్లు, థ్రిఫ్ట్ సొసైటీకు రూ.80 కోట్లు, ఎస్‌బీఎఫ్‌కు రూ. 100 కోట్లు చెల్లించకుండా జాప్యం చేస్తుందని మండిపడ్డారు. కార్మికులకు తక్షణమే నాలుగు నెలల జీతం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రధానకార్యదర్శి యు. రామస్వామి మాట్లాడుతూ స్టీల్ కార్మికులు అధికంగా ఉత్పత్తి చేస్తున్నారని స్టీల్ కార్యదర్శి ఒప్పుకున్నారని అందుకే కార్మికులకు జీతాలు చెల్లించడం లేదా అని ప్రశ్నించారు. యూనియన్ అధ్యక్షులు వై.టి.దాస్, పి. శ్రీనివాసరాజు, కె. గంగాధర్, టి.వి.కె. రాజు, మరిడయ్య తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌ఎస్‌ను తక్షణమే ఉపసంహరించుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణలో భాగమే వలంటరీ రిటైర్‌మెంట్ స్కీమ్ (వీఆర్‌ఎస్) అని.. దాన్ని వెంటనే ఉప సంహరించుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. సీఐటీయూ కార్యాలయంలో శనివారం జరిగిన పోరాట కమిటీ సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురి చేసి వీఆర్‌ఎస్ పేరుతో ఇంటికి పంపించేందుకు యాజమాన్యం కుట్రపన్నుతోందని ఆరోపించారు. జీతాల చెల్లింపుకే డబ్బులు లేవన్న ప్రభుత్వం ఇప్పుడు వీఆర్‌ఎస్‌కు ఎలా డబ్బు ఇస్తుందని వారు ప్రశ్నించారు. 2023లో స్టీల్‌ప్లాంట్‌లో ఐదు వేల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని పార్లమెంట్ సాక్షిగా ఉక్కు మంత్రి ప్రకటించారని, ఈ రెండేళ్లో 2 వేల మంది ఉద్యోగ విరమణ చేశారన్నారు. సుమారు 7 వేల ఉద్యోగాలు ఖాళీగా ఉండగా వీఆర్‌ఎస్ ప్రకటించడం దుర్మార్గమన్నారు. ప్లాంట్‌ను మిట్టల్, అదాని, జిందాల్, పోస్కో వంటి వారికి కట్టబెట్టడంలో భాగంగా జరుగుతున్న పరిణామాలని మండిపడ్డారు. ఉద్యోగులెవరూ వీఆర్‌ఎస్‌కు దరఖాస్తు చేయవద్దని వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు డి. ఆదినారాయణ, జె. అయోధ్యరామ్, రమణమూర్తి, కె.ఎస్.ఎన్.రావు, రామ్మోహన్‌కుమార్ పాల్గొన్నారు.

కూటమి కుట్రలో భాగమే ..

అక్కిరెడ్డిపాలెం: స్టీల్‌ప్లాంట్‌లో వలంటరీ రిటైర్మెంట్ స్కీం ప్రకటన దుర్మార్గమని సీఐటీయూ విశాఖ జిల్లా ప్రధానకార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, సీఐటీయూ విశాఖ జిల్లా ఉపాధ్యక్షుడు ఎస్.జ్యోతీశ్వరరావు తెలిపారు. శనివారం సాయంత్రంలో భెల్ (హెచ్‌పీవీపీ) సీటు నాయకులు సమావేశంలో నాయకులు మాట్లాడుతూ ఈ వీఆర్‌ఎస్ స్కీం ఈ నెల 8వ తేదీన మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమావేశం అయిన కొన్ని గంటల్లోనే వీఆర్‌ఎస్ భూతాన్ని పెట్టారన్నారు. ఈ స్కీంను స్టీల్‌ప్లాంట్ ఉద్యోగులంతా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. భెల్ నాయకులు ప్రకాష్, జగన్నాథరావు పాల్గొన్నారు.

వైభవంగా కూడారై ఉత్సవం



కల్యాణ వేంకటేశ్వరస్వామికి గరుడవాహనంలో తిరువీధి నిర్వహిస్తున్న భక్తులు



విశేష అలంకరణలో గోదాదేవి



గోదాదేవికి సమర్పించిన నైవేద్యం

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ ఎస్టీబీఎల్ ప్రాంగణంలోని తిరుమల బాలాజీ దివ్యక్షేత్రంలో కూడారై ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. శనివారం దివ్యక్షేత్రంలో తిరుప్పావై 27వ పాసురం సందర్భంగా గోదాదేవికి ప్రసాదాన్ని సమర్పించారు.

• భెల్ సిగ్నల్ పాయింట్ వద్ద గల ప్రసన్న వేంకటేశ్వరాలయంలో కూడారై ఉత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. సుగంధ ద్రవ్యాలతో పాయసాన్ని తయారు చేసి గోదాదేవి, శ్రీవారికి 108 ఇత్తడి గిన్నెల్లో సమర్పించారు.

వైభవంగా తిరువీధి ఉత్సవం

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని కల్యాణ వేంకటేశ్వర స్వామిని గరుడ వాహనంలో తిరువీధి నిర్వహించారు. తర్వాత భక్తులు సమర్పించిన ప్రసాదాన్ని 108 వెండి పాత్రల్లో స్వామి నైవేద్యంగా సమర్పించారు. ఆలయ ధర్మకర్త ఈకే చారి దంపతులు, ఆలయ కమిటీ, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

విద్యార్థి గణేష్‌కు అభినందన



గణేష్‌ను అభినందిస్తున్న బలరామకృష్ణ తదితరులు

గాజువాక: స్థానిక టీఎస్సార్, టీబీకే డిగ్రీ, పీజీ కళాశాలలో ఎమ్మెస్సీ చదువుతున్న ఎం.గణేష్ ఇంటర్నేషనల్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు సంపాదించాడు. ఎలాంటి ఆధారం లేకుండా సైకిల్‌ను 3 నిమిషాల 22 సెకండ్లపాటు బ్యాలెన్స్ చేసి బంగారు పతకంతో పాటు ఈ రికార్డ్ సాధించినట్టు కళాశాల చైర్మన్ టి.బలరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన గణేష్‌ను అభినందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.విష్ణువర్ధన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి వచ్చె.. సందడి తెచ్చె

ఘనంగా సంక్రాంతి సంబరాలు



ఉక్కు వీవీవీలో సాంస్కృతిక ప్రదర్శనలో విద్యార్థినులు



వివిధ వేషధారణల్లో విద్యార్థులు



భోగిమంట వేస్తున్న చిన్నారులు, అతిథులు

ఉక్కునగరం: స్థానిక విశాఖ విమల విద్యాలయం (వీవీవీ)లో శనివారం సంక్రాంతి సంబరాలు ఘనంగా జరిగాయి. పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన ఉత్సవాల్లో కరణంరెడ్డి నర్సింగరావు, నీరుకొండ రామచంద్రరావు ముఖ్య అతిథులుగా పాల్గొని వేడుకలు ప్రారంభించారు. బాలికలకు రంగోలి పోటీలు, బాలురకు పతంగుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంక్రాంతి విశిష్టతను వివరిస్తూ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. భోగి మంటలు వేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయిని సిస్టర్ ఇలియా, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, నాగేశ్వరరావు, సత్యనారాయణ, అనిత, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

సంబరం.. అదిరె

పెదగంట్యాడ: జీవీఎంసీ 76వ వార్డు గాంధీనగర్‌లోని గిరీష్ విద్యా నికేతన్‌లో సంక్రాంతి సంబరాలను శనివారం ఘనంగా నిర్వహించారు. రంగవల్లులు, అందమైన గొబ్బెమ్మలు పెట్టి ఆకట్టుకున్నారు. చిన్నారులు తెలుగుదనం ఉట్టిపడేలా కట్టుబొట్టుతో కనువిందు చేశారు. ఆటపాటలతో అలరించారు. భోగి మంటలు వేసి సందడి చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు భీమిరెడ్డి శ్రీనివాసరావు సంక్రాంతి విశిష్టతను వివరించారు.



పొంగలి తయారు చేస్తున్న విజ్ఞాన్ అధ్యాపకులు

అగనంపూడి: జీవీఎంసీ 88వ వార్డు కాపుజగ్గరాజుపేటలోని విజ్ఞాన్ మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. భోగి మంటలు వేసి పాటలు పాడుతూ నృత్యం చేశారు. గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, పాలపొంగులు, చెరుకుగడలు, బొమ్మల కొలువు, సోది, ఎరుకుల వేషధారణల్లో విద్యార్థులు అలరించారు. ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ సుహాసిని ఆధ్వర్యంలో సంబరాలు నిర్వహించారు.

రహదారి భద్రతపై అవగాహన



రోడ్డు భద్రతా నియమాలపై అవగాహన కల్పిస్తున్న వైద్యులు, పోలీసులు

అగనంపూడి: రహదారి భద్రతా నియమాలు ప్రతి ఒక్కరూ పాటిస్తే రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉండదని అగనంపూడి ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జె.భారతి అన్నారు. రహదారి భద్రతా వారోత్సవాల సందర్భంగా శనివారం అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆవరణలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రోడ్డు నియమాలు తెలియజేస్తూ ఆవరణలో బ్యానర్లు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ఉషా, డాక్టర్ రజ్వీ సుస్తానా, ఐసీటీసీ కోఆర్డినేటర్ రవి, పోలీసులు పాల్గొన్నారు.

న్యాయమూర్తి రాజేంద్రబాబుకు పదోన్నతి



గాజువాక: గాజువాకలో సీనియర్ సివిల్ జడ్జిగా పని చేస్తున్న ఇ.రాజేంద్రబాబుకు అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి లభించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి శుక్రవారం ఉత్తర్వులు వెలువడినట్టు గాజువాక కోర్టు వర్గాలు తెలిపాయి. 3వ ఏసీఎంఎం జడ్జిగా మూడేళ్ల క్రితం గాజువాక బదిలీపై వచ్చిన ఆయన ప్రస్తుతం సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు అదనపు జిల్లా జడ్జిగా పదోన్నతి పొందడంపై సహచర న్యాయమూర్తులు, న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

ఉత్సాహంగా క్రికెట్ పోటీలు



భెల్ క్రీడా మైదానంలో క్రికెట్ ఆడుతున్న దృశ్యం



క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

అక్కిరెడ్డిపాలెం: బీహెచ్‌పీవీ హార్ట్ ఫుల్ ఓల్డ్ అండ్ న్యూ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న విశ్రాంత, ప్రస్తుత ఉద్యోగుల కుటుంబాల క్రికెట్ పోటీలు శనివారం రెండో రోజు ఉత్సాహంగా సాగాయి. భెల్ టౌన్ షిప్‌లోని క్రీడా మైదానంలో నిర్వహించిన పోటీల్లో పలు జట్లు పాల్గొన్నాయి. క్రీడాకారులను చీర్ గర్ల్స్ అలరించారు. ఆదివారం ఫైనల్స్ నిర్వహించనున్నారు. కార్యక్రమంలో హార్ట్ ఫుల్ ఫ్రెండ్స్ గౌరవ అధ్యక్షుడు ములక నానిబాబు (యూఎస్ఏ), అధ్యక్షులు జె.రాము, కార్యదర్శి ఎస్.ఎస్. ఎస్.రవి, కోశాధికారి వై.కృష్ణ, ఉపాధ్యక్షులు పసుపులేటి శ్రీనివాస్, శేఖర్, పాండురంగ, రవి, ప్రశాంత్, సుబేదార్, ములక ప్రసాద్‌బాబు, ఎం.ఎస్.కుమార్ పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ ప్రారంభం

అగనంపూడి: జీవీఎంసీ 87వ వవార్డు కణితి, వడ్లపూడి కళింగ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సంక్రాంతి ప్రీమియర్ లీగ్‌ను శనివారం కార్పొరేటర్ బొండా జగన్నాథం, వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి కోమటి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డ గోవింద్, జిల్లా కార్యదర్శి ప్రగడ వేణుబాబు ప్రారంభించారు. వారు మాట్లాడుతూ క్రీడల వల్ల పోటీతత్వంతో పాటు స్నేహభావం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో బొడ్డ సన్యాసిరావు, ప్రగడ శ్రీనివాస్, దుగ్గపు దానప్పలు, బొడ్డ సూరిబాబు, పాలిశెట్టి సత్యనారాయణ, పూడి శ్రీనివాస్, దాకా కృష్ణ, బొండా గోవిందరాజులు, త్రినాథ్, శంకరరావు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గాజువాక

✆ 9912222749, 9705347420, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com